క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు

వాల్మీకిపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చంద్రయాన్ 1, 2, 3పై క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని, విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనాలని సూచించారు. క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురుప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు పూజలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లిలో 200 ఏళ్ళ క్రితం వెలసిన పురాతనమైన కోదండ రామాలయం శిథిలావస్థకు చేరడంతో సోమవారం గ్రామస్తులు జేసీబీతో తొలగించారు. ఆలయంలో జీర్ణోద్ధరణ పనులకు పూజలు, గోపూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించిన అనంతరం ఆలయాన్ని కూల్చారు. సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డిలు మాట్లాడుతూ గ్రామ ప్రజలతో పాటు ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సహకారంతో నూతనంగా ఆలయ నిర్మాణ పనులు చేపడతామన్నారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువుకు చెందిన దేరంగుల శివశంకర్ (33)పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల చోరీ కేసు నమోదైంది. అతడిని అరెస్టు చేసిన అనంతరం కొన్నాళ్ళు జైలు శిక్ష అనుభవించి ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం వాయిదాపై తంబళ్ళపల్లి కోర్టుకు హాజరు కాగా సదరు నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.500ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు.

విద్యావ్యవస్థలో నూతన ఒరవడి

కలకడ : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేవిధంగా విద్యా వ్యవస్థలో నూతన ఒరవడి సృష్టించి అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నాడు–నేడు పనులు చేపట్టాలని సర్పంచ్ శాంతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ముడియంవారిపల్లె పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. నాడు–నేడు పనులు వెంటనే పూర్తి చేయాలని ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నిధులు ఉన్నా అభివృద్ధి చేయకుంటే ఎలా అని నిలదీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివాజీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ చదివితే ఉద్యోగం గ్యారంటీ

మదనపల్లె సిటీ: డిగ్రీ చదివితే ఉద్యంగ గ్యారంటీగా వస్తుందని ఆర్‌జెడీ డాక్టర్ బాబు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ ఆనర్స్ నాలుగు సంవత్సరాల కోర్సు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. డిగ్రీ చదివిన వెంటనే ఇంకో చేతిలో ఉద్యోగం వచ్చే విధంగా కోర్సులు ఉన్నాయన్నారు. మల్టి డిసిప్లినరీ, జీవన నైపుణ్యాల కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు సూర్యశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌బాబు, గురుమూర్తి, మోహన్‌వల్లి, నాగమణి పాల్గొన్నారు.

మదనపల్లెలో క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ బ్యాంక్

మదనపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికస్వావలంబన, పేదరిక నిర్మూలన కోసం క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ బ్యాంక్ పనిచేస్తుందని జోనల్ మేనేజర్ లోకేష్, డివిజనల్ మేనేజర్ నాగరాజు తెలిపారు. సోమవారం మండలంలోని సురభి కాలనీలో క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. కర్ణాటకలోని బెంగళూరు కేంద్రంగా వినూత మధుసూధనరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన తమ బ్యాంక్ దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో 353 జిల్లాల్లో 1,786 బ్రాంచీలతో 44లక్షల మంది గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రుణసదుపాయం కల్పించామన్నారు. మహిళా గ్రూపులను ఏర్పాటుచేసి వారికి రుణాలు మంజూరుచేయడమే బ్యాంకు ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ప్రకాశం, హెచ్‌డీఎఫ్‌సీ దావూద్‌ఖాన్, ప్రకాష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కష్టపడి చదవండి

కురబలకోట: బీటెక్ విద్యార్థులు నాలుగేళ్లు కష్టపడి చదివితే జీవితమంతా సుఖంగా బతకవచ్చని మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల రాటకొండ రంగారెడ్డి అకాడమీ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్, విశ్వం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం ఈకళాశాలల్లో కొత్తగా ప్రథమ సంవత్సరంలో బీటెక్‌లో చేరిన విద్యార్థులకు ఆయా కళాశాలల్లో వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో బీటెక్ కోర్సు కీలకమన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రూ.28 లక్షలతో 4 ట్రాక్టర్‌ల కొనుగోలు
- మున్సిపాలిటీలో నూతన ట్రాక్టర్‌లకు పూజా కార్యక్రమాలు
- స్వయంగా నడిపి ప్రారంభించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా


ట్రాక్టర్‌లకు పూజాకార్యక్రమాలు నిర్వహించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మున్సిపాలిటీలలో అవసరమైన వసతులు కల్పిస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం మున్సిపల్ జనరల్‌ఫండ్స్ నుంచి రూ.28లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 4 నూతన ట్రాక్టర్‌లకు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజంలు ట్రాక్టర్‌లను స్వయంగా నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మదనపల్లె మున్సిపాలిటీని అభివృద్ధిపథంలో నడిపేందుకు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నామన్నారు. 35వార్డుల్లో పారిశుద్య స్థితిగతులను మెరుగుపరచడంతో పాటుగా పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటిలో పర్యటించినప్పుడు ప్రజలు ప్రస్తావించిన సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. కరోనాతో రెండేళ్లు మందకొడిగా సాగిన అభివృద్ధిని పరుగులు తీయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయన్నారు. నీటిట్యాంకర్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటే... తమ కౌన్సిల్ పగ్గాలు చేపట్టాక వాటన్నంటినీ నిలుపుదల చేశామన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ శివారుప్రాంతాలైన అమ్మచెరువుమిట్ట, మంజునాథకాలనీ, వైఎస్సార్ నగర్, రామారావుకాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనకు ఇప్పటికే నిధులు మంజూరుచేశామని, పనులు త్వరితగతిన జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ సహకరించాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కే.ప్రమీల, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, బి.ఏ.ఖాజా, వసీం, ఎస్వీ.రమణ, రేణుక, పాల్ చంద్రశేఖర్, రామిశెట్టిశివయ్య, ఎం.వి.రమణ, ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, రహీం, ఆంజనేయులు, మునిశేఖర్, జాన్‌బాబు, రాయల్‌రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ పింఛను కానుక


వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

పెద్దమండ్యం: అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పింఛను కానుక అందిస్తామని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ పింఛను కానుక కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు ఎంపీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన వింతువులు, వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వం వైఎస్సార్ పింఛను కానుక అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 5521 మంది పింఛను దారులకు ప్రతి నెలా రూ. 1.53 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి దశల వారీగా పింఛను సొమ్మును పెంచుతున్నట్లు తెలిపారు. వలంటీర్‌ల ద్వారా ఇంటి వద్దకే వైఎస్సార్ పింఛను కానుక అందిస్తున్నట్ల తెలిపారు. జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, జిల్లావక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ రషీదా, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, కంటి విశ్వనాథరెడ్డి, జింకా విశ్వనాథ, సి సరస్వతి, భూదేవి, పీరాన్‌బి, శిరీషా, ఎంపీటీసీలు బొడెం రవితేజ, మంచూరి జయరాం పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

ములకలచెరువు: అర్హులకు కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను ప్రజాప్రతినిధులు సోమవారం పంపిణీ చేశారు. ములకలచెరువు సచివాలయం వద్ద అర్హులకు సర్పంచు రహమత్‌బీ, ఎంపీటీసీ ఆయిషా పంపిణీ చేశారు. ములకలచెరువు పంచాయతీకి 50 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి.

ఎమ్మెల్యే కృషితోనే నియోజకవర్గ అభివృద్ధి


గూడుపల్లెలో బీటీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ములకలచెరువు: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కృషితోనే తంబళ్లపల్లె నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందని ఎంపీపీ సాయిలీలా, వైఎస్ ఎంపీపీ గోర వెంకటరమణారెడ్డి, సర్పంచు రెడ్డెప్ప అన్నారు. సోమవారం మండలంలోని గూడుపల్లి పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. కనుగొండవారిపల్లె వద్ద ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. అనంతరం చెరువుకింద పల్లెలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ అధ్యక్షుడు గోర రవీంద్రారెడ్డి, కుల్‌దీప్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ

పీలేరు : 11వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌లో పీలేరుకు చెందిన యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు అకాడమీ మాస్టర్ ఇనాముల్ హక్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం కర్నూలులో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొని అండర్ గరల్స్ విభాగంలో దేవి, రెడ్డి లహరి ×కుమ్మితే×లో 1వ స్థానం, కటాలో 2వ స్థానం సాధించినట్లు తెలిపారు. అండర్ 10 బాయ్స్‌లో ఎస్. రహీల్‌ఆఫ్రిద్ కటా, కుమ్మితేలో 2వ స్థానం, సి.హెచ్. వెలయిదం కుమ్మితేలో 2వ స్థానం, కటాలో 3వ స్థానం సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

పెద్దతిప్పసముద్రం: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగనన్న లక్ష్యమని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, సుబ్బరాం, డ్రిప్ రమణ అన్నారు. పల్లెబాటలో భాగంగా సోమవారం మద్దయ్యగారిపల్లి పంచాయతీలో వారు పర్యటించారు. ఇంటింటికీ వెళ్ళి నాలుగున్నరేళ్ళ కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఇంకా అర్హులై పథకాలు అందకుంటే తమ దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా గడప వద్దకే సచివాలయ సిబ్బంది వచ్చి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని వివరించారు. ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఏఓ ప్రేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు జక్కల రామాంజులు, కేశవ్, మెకానిక్ చంద్ర, భాస్కర్‌నాయుడు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

– డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

కలికిరి: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. డీసీహెచ్‌ఎస్ డి.డేవిడ్ కుమార్‌తో కలిసి కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్‌లకు అందుతున్న సదుపాయాలు, రోగుల పట్ల సిబ్బంది తీరుపై రోగులను విచారించారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు నమ్మకం కలిగేలా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. సిబ్బంది, వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై ఆసుపత్రిలో ఉన్న సదుపాయాలు, రోజు ఓపీ వివరాలు, మందులు నిల్వ, అవసరమైన మందులు, అత్యవసర చికిత్సలకు అందుబాటులో ఉన్న మందుల రికార్డులను పరిశీలించారు. కాన్పులు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ప్రభుత్వాసుపత్రిలోనే జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్, వైద్యాధికారులు అనీల్‌కుమార్, వెంకటేష్, సిమ్రాన్, ఉయద్‌కిరణ్ పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. కొండకింద మేకలవారిపల్లెకు చెందిన మహిళలు ప్రతి ఏడాది ఆనవాయితీ మేరకు మొదటి పంట ఇంటికి చేరగానే స్వామికి చెక్కర పొంగలి నైవేద్యంగా సమర్పించారు. మహిళలు కొండకు చేరకు వీరన్నగుహ వద్ద చెక్కరపొంగలి వండి సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి స్వామికి సమర్పించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలతో భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరమ్మగుట్టలోని గౌరమ్మకు పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

విద్యాసామగ్రి వితరణ

తంబళ్లపల్లె: కన్నెమడుగు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలల్లోని విద్యార్థులకు బెంగళూరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బాలాజీ, మీనా దంపతులు విద్యార్థులకు సామగ్రిని వితరణగా ఇచ్చారు. సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవో–2 నాగసుబ్బరాయుడు విద్యార్థులకు వాటిని అందజేశారు. అలాగే రిటైర్డ్ టీచర్ జీవీ ప్రసాద్ ద్వారా విద్యార్థులకు పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మార్సీ కార్యాలయానికి రౌండ్ చైర్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మదన్మోహన్, వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్త పరమేశ్వరి పాల్గొన్నారు. దాతలను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వైభవంగా కుంభాభిషేకం

రామసముద్రం: రామసముద్రం మండలం మూగవాడి గ్రామంలో వెలసిన పురాతన శ్రీపుండీశ్వర స్వామి కుంభాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 101 బిందెలతో స్వామివారి లింగద్భోవాన్ని పూర్తిగా నీటితో నింపారు. వేదపండితులచే వేద మంత్రోచ్చారణతో రుద్రచమకం, నమకం చదివి మహా మంగళహారతి అందించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించారు. ఓం నమః శివాయ నామ స్మరణతో ఆలయం మారుమ్రోగింది.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం: ఈ నెల 9వ తేది స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ కాబడినటువంటి క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోట్, తదితర రాజీ కాదగిన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోకుండా ప్రశాతంగా జీవించాలన్నారు.

కలకడ : జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ సిటిస్వామి కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో వివిధ కేసుల్లోని కక్షిదారులను పిలిపించి లోక్‌అదాలత్‌లో పొందే ఉచిత ఉపయోగాలను తెలియజేశారు. 9వ తేదీన అన్ని న్యాయస్థానా ల్లో లోక్‌అదాలత్ నిర్వహిస్తారని, రాజీపడదగిన క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, వివాహసంబంధ కేసులను గుర్తించి కక్షిదారులకు నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. రాజీ మార్గమే–రాజమార్గమని గుర్తు చేశారు.

8న మండలస్థాయి క్రీడాపోటీలు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్‌లో ఈనెల 8న స్కూల్‌గేమ్స్ మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే.ఎస్.ఎన్.మూర్తి, స్కూల్‌గేమ్స్ కోఆర్డినేటర్ ఎం.భద్రయ్య తెలిపారు. 14 నుంచి 17 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్ తదితర క్రీడల పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఎంపీ చొరవతో మసీదుకు రూ.5 లక్షల నిధులు

మదనపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డి చొరవతో మండలంలోని కోళ్లబైలు గ్రామపంచాయతీ అమ్మచెరువుమిట్ట, వైఎస్సార్ జగన్‌కాలనీలోని అమీనియా మసీదు కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. 5లక్షలు సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీఎండీసీ- సీఎస్ఆర్ నిధుల నుంచి జగన్‌కాలనీలోని అమీనియా మసీదు కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5లక్షల కేటాయింపుకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను మసీదు పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మసీదు నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాల్సిందిగా మసీదు పెద్దలు ఎంపీ మిథున్‌రెడ్డిని కోరిన వెంటనే ఆయన ప్రత్యేక చొరవతో సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేశారన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. సోమవారం కాలేజీలో ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన చంద్రయాన్–3లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన శాస్త్రవేత్తలే ప్రముఖ పాత్ర పోషించారన్నారు. చాలా మంది సాధారణ ఇంజనీరింగ్ కాలేజీలో చదివిన వారు ఉన్నారన్నారు. ప్రస్తుత సమాజంలో ఇంజనీరింగ్ విద్యార్థుల ఆవశ్యతను వివరించారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన ప్రముఖులు వారు ఎంచుకున్న ఇంజనీరింగ్ విభాగాలను తెలియజేశారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం జగన్

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ఆవులయ్యగారిపల్లె రోడ్డు నిర్మాణ భూమి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : సంక్షేమ పథకాల సృష్టికర్త ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లె రోడ్డు నుంచి కురవపల్లె మీదుగా ఆవులయ్యగారిపల్లెకు రూ. 1.80 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కేవీపల్లె గ్రామ సచివాలయం–1 పరిధిలో కుమ్మరపల్లె, రాములవారిపల్లె, తోటిహరిజనవాడ, కొత్తపల్లె తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో అవినీతికి తావులేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ముఖ్యమంత్రి బటన్ నొక్కగానే లబ్దిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి సీఎం జగన్‌ను ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఒక రూపాయి ఖాతాకు జమ చేసి ఇళ్లు మంజూరు చేశామని చంద్రబాబునాయుడు మోసం చేశారని తెలిపారు. అలాంటి ఇళ్లకు కూడా రెండు నెలల్లో బిల్లులు మంజూరు చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, సైపుల్లాఖాన్, చిన్నయర్రమరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులు, లాల్‌ఖాన్, ద్వారకనాథరెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం


ప్రమీలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

బి.కొత్తకోట: సీఎం సహాయ నిధి పేదలకు వరమని పర్యాటకశాఖ డైరెక్టర్ మిట్టపల్లె భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీలో సర్పంచు భీమగాని నాగిరెడ్డి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. గుండుపల్లె, కోటిరెడ్డిగారిపల్లె, చిటికివారిపల్లె, జంగాలపల్లె, వేపమాకులపల్లె, తోకలపల్లె, ఎర్రకొండ కిందపల్లె, కొత్తపల్లె, గుంతావారిపల్లెల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పలువురు వ్యక్తిగత, సామూహిక సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో స్వాతంత్ర్యం వచ్చాక 72 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో ఎంపీ, ఎమ్మెల్యే అధ్వర్యంలో జరిగిందన్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండపై పర్యాటక అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రతిపాదించిన పనులపై పర్యాటకశాఖ చర్యలు చేపట్టిందన్నారు. పవర్ వాటర్ టెక్ ఎండీ బి.పద్మనాభరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సామూహిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవతో గ్రామాల్లో సమస్యలు లేవన్నారు. అనంతరం గుడిపల్లెకు చెందిన ప్రమీలకు రూ.4 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఫీక్‌అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మి నరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, సర్పంచులు భీమగాని నాగిరెడ్డి, సాంబశివ, లక్ష్మీదేవి, గిరిజ రఘునాథరెడ్డి, జయరామిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఉమామహేశ్వరీ, ఎంపీటీసీలు గౌతమి, రామసుబ్బారెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం


ఉప సర్పంచ్‌గా ఎన్నికైన మస్తాన్‌ను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు


ఉప సర్పంచ్ అఖిలకు ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న రిటర్నింగ్ అధికారి నాగార్జునరెడ్డి

రామసముద్రం: రామసముద్రం పంచాయతీ ఉప సర్పంచ్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఎంఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వార్డు సభ్యులు చేతులు ఎత్తే ప్రక్రియతో దిగువపేటకు చెందిన తపాలా మస్తాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్న సభ్యులకు , మండల నాయకులకు , ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారి. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, వార్డు సభ్యులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుట్టపాళెం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా షేక్ అఖిల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి నాగార్జున రెడ్డి తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించగా వార్డు సభ్యులు అఖిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ధృవీకరణ పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎంపికైన ఉప సర్పంచ్ అఖిలను సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

తంబళ్లపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డిలు తెలిపారు. సోమవారం రేణుమాకులపల్లె పంచాయతీలో సర్పంచ్ అలీ, మహ్మద్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు మహేష్‌ల ఆధ్వర్యంలో పల్లెబాట నిర్వహించారు. సుమారు రూ.40 లక్షల ఖర్చుతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి కొన్ని సంబంధిత శాఖ అధికారులతో అక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీవో అంజనప్ప, ఏపీఎం గంగాధర్, ఏఈలు అశోక్, సుజాత నాయకులు కోటేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్‌కు ఎన్‌సీసీ యూనిట్

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్(తెలుగు)కు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైనట్లు హెచ్‌ఎం పీ.అంజాద్‌అలీఖాన్ తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీహైస్కూల్‌లో 8వ తరగతికి చెందిన 50 మంది విద్యార్థులను ఎన్‌సీసీ యూనిట్‌కు ఎంపిక చేశారు. మొదటిసారిగా నిమ్మనపల్లె హైస్కూల్‌కు 35(ఏ)బిఎన్ఎన్‌సీసీ, చిత్తూరు ట్రైనింగ్ యూనిట్ మంజూరు కావడంపై ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. ఎన్‌సీసీ నాయక్ సుబేదార్.రాకేష్ లాల్, హవాల్దార్ మస్తాన్, సీటీఓ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు.